ప్రజాశక్తి

సోమవారం 1 జులై 2024 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

భారీ వర్షంతో రైతులకు ఊరట

- సేద్యానికి ప్రయోజనకరంగా వానలు
- ముమ్మరం కానున్న వ్యవసాయ పనులు

గాలుల ధాటికి గుంటూరుబ్రాడీపేటలో కూలిన చెట్టు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. గుంటూరులో అత్యధికంగా 113. 2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 60.5 మిల్లీ మీటర్ల సగటు వర్షంపాతం నమోదైంది. పల్నాడు జిల్లాలో అత్యధికంగా క్రోసూరులో 65.6 మిల్లీ మీటర్ల వర్షంపాతం నమోదు కాగా సగటు వర్షపాతం 26.3 మిల్లీమీటర్లుగా నమోదైంది.

చాలా కాలంగా చాలీ చాలని వర్షంతో అల్లాడుతున్న రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. మెట్ట భూముల్లో వెంటనే పత్తి, అపరాల సాగుకు అవకాశాలు మెరుగుపడ్డాయి. వర్షంతోపాటు గాలులు, భీకరమైన ఉరుములు, మెరుపులతో శనివారం రాత్రి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఆదివారం ఉదయం ఈదురు గాలులకు పలుచోట్ల చెట్లు విరిగి పడ్డాయి. గుంటూరు బ్రాడీపేట 2వ లైను, బృందావన్ గార్డెన్స్ సెంటర్‌లో చెట్లు నేలకూలాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. బిఆర్ స్టేడియం, ఎన్‌టిఆర్ స్టేడియంలో వర్షం నీరు నిలిచింది. రోడ్లపై వర్షం నీరు, మురుగునీరు కలిసి పారడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరునుంచి భారీ వర్షం కురిసింది.

గుంటూరు జిల్లాలో జూన్ నెలలో మొత్తం 97.1 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదు కావాల్సి ఉండగా 30వ తేదీ వరకు 171.1 మిల్లీ మీటర్లు నమోదైంది. 15 మండలాల్లో అదనంగా, తాడేపల్లి, తుళ్లూరు, మేడికొండూరు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలో జూన్‌లో 80.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా నెల మొత్తం మీద 102.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అయితే 10 మండలాల్లో కనీస వర్షపాతం నమోదు కాలేదు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రస్తుతం రైతులు పత్తి సాగుకు మొగ్గు చూపుతున్నారు.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు వర్షపాతం వివరాలు (మిల్లీ మీటర్లలో)

గుంటూరు జిల్లా :	
గుంటూరు పశ్చిమ	113.2
గుంటూరు తూర్పు	80.4
ప్రత్తిపాడు	95.4
వట్టిచెరుకూరు	78.2
చేబ్రోలు	77
ఫిరంగిపురం	66.2
మంగళగిరి	61.6
పెదకాకాని	59.2
తాడికొండ	56.4
తుళ్లూరు	52.4
పొన్నూరు	51.4
మేడికొండూరు	49.4
తెనాలి	49
తాడేపల్లి	48.6
కొల్లిపర	40.4
కాకుమాను	39.8
దుగ్గిరాల	37.8
పెదనందిపాడు	32.4
పల్నాడు జిల్లా :	
క్రోసూరు	65.6
నాదెండ్ల	55.4
అచ్చంపేట	47
పిడుగురాళ్ల	45.4
రాజుపాలెం	45.2
సత్తెనపల్లి	44
కారంపూడి	34.6
మాచర్ల	34.2
పెదకూరపాడు	33.4
చిలకలూరిపేట	34.2
యడ్లపాడు	32
నరసరావుపేట	25.8

నేడు పింఛన్ల పంపిణీ

- పెనుమాకలో ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు
- మూడు నెలల తరువాత పునరుద్ధరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాడేపల్లి మండలం పెనుమాకలో ఉదయం 6 గంటలకు ఇంటింటికి ఫించన్ల పంపిణీని ప్రారంభించనున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పింఛన్ల పంపిణీకి సంబంధించి నగదును శనివారం రాత్రికే సంబంధిత ఉద్యోగులకు అధికారులు అప్పగించారు. ఏప్రిల్, మే, జూన్ నెలలో ఇంటి వద్ద కాకుండా సచివాలయాల వద్ద, బ్యాంకుల ద్వారా పంపిణీ చేసిన పింఛన్లను మూడునెలల తరువాత తిరిగి జులై ఒకటో తేదీన మళ్లీ ఇంటి వద్ద పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా పెంచిన ఫించను సొమ్ము ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వర్తింప చేస్తుండటంతో ప్రతి ఒక్కరికీ మూడు నెలల అదనపు సొమ్ము కూడా అందనుంది.

వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.3 వేల పింఛను రూ.4 వేలకు పెరిగింది. వీరికి మూడు నెలల సొమ్ము మరో రూ.3 వేలు కలిపి ఒక్కొక్కరికి రూ.7 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వికలాంగులకు రూ.3 వేలనుంచి రూ.6 వేలకు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వీరికి రూ.6 వేలు అందిచనున్నారు. గుంటూరు జిల్లాలో 2,61,598 మంది పింఛను దారులు, పల్నాడు .జిల్లాలో 2,83,119 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించనున్నారు. ఐదేళ్లగా ప్రతినెలా మొదటి వారంలో మూడ్రోజులపాటు పింఛను సొమ్ము ఇంటికి వచ్చి వాలంటీర్లు ఇవ్వడం వల్ల లబ్ధిదారులు చాలా వరకు సంతృప్తిగా ఉండగా ఎన్నికల కోడ్‌వచ్చిన తరువాత ఏప్రిల్, మే, జూన్ నెలల్లో సచివాలయం ఉద్యోగులు ద్వారా కొంత మందికి, బ్యాంకుల ద్వారా కొంత మంది అందచేశారు. ఎన్నికల కోడ్ ముగియడంతో ఈనెల నుంచి తిరిగి ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే ఈసారి వాలంటీర్లతో కాకుండా సచివాలయ ఉద్యోగులు, ఇతర శాఖల ఉద్యోగులతో పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశారు.

జిజిహెచ్‌లో సదుపాయాలు మరిన్ని పెంపు

సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్ కుమార్ 8 లో

సీడ్ యాక్సెస్ రైతులకు ప్యాకేజీ పెంచి ఇవ్వాలి 5 లో

రజకవృత్తిదారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి 7 లో

సమీక్షలో కేంద్ర మంత్రి చంద్రశేఖర్, కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఇతర అధికారులు

కౌలు రైతులకు మేలు చేస్తాం

వ్యవసాయ, అనుబంధ శాఖల సమీక్షలో కేంద్రమంత్రి చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు విరివిగా ఇవ్వాలని, వీలైనంత వరకు ప్రభుత్వ పథకాలు, రుణాలు వారికి అందేలా చూడాలని అధికారులను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో మంత్రి చంద్రశేఖర్ ఆదివారం సమీక్షించారు. వ్యవసాయశాఖ అనుబంధశాఖల వివరాలు, సాగు భూముల వివరాలు, మండలాలు వారీగా సాగు చేస్తున్న పంటల వివరాలు, ఇరిగేషన్ కాల్వలు, వర్షపాతం వివరాలు, విత్తనాల సరఫరా, ఎరువులు లభ్యత, వినియోగం, కౌలు రైతు కార్డులు, భూసారా పరీక్షలు, ఉద్యాన పంటలు, ప్రకతి వ్యవసాయం, రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు ▸ 2లో

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి

వివిధ ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న పేదల ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మంగళగిరి నియోజకవర్గంలో అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లో 22 వేల కుటుంబాలు ఇళ్లేసుకుని నివాసం ఉంటున్నాయని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేస్తామని ఎన్నికలప్పుడు లోకేష్ హామీ ఇచ్చారని, యువగళం పాదయాత్ర సందర్భంగా సీతానగరంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని శిలాఫలకాన్ని సైతం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ ప్రాంతలో నూతన నిర్మాణాలు, అపార్ట్మెంట్స్ పెద్ద ఎత్తున ▸ 2లో

డాక్టర్స్ డే శుభాకాంక్షలతో...

G.M. GANGADHAR RAO
Cell : 9966632432, 9248666111

LifeCare
A COMPLETE DIAGNOSTIC SOLUTION

LIFE CARE DIAGNOSTICS

Tadikondala Towers, Narasimha rao Naidu Street,
Suryaraopet, VIJAYAWADA
B.O. : Opp. Aravinda School, Kunchenapalli,
Tadepalli Mandal.
Help Line : 9966632432, 9248666111, 8121772377
24 hrs Service Available

రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ శారద

డి3 శారద సర్వీస్ సొసైటీ ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన డి-3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని బుర్రిపాలెంలో ఆదివారం ఎన్సీడీఎస్ స్క్రీనింగ్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సంస్థ ఆధ్వర్యంలో ప్రతినెలా చివరి ఆదివారం ఉచిత వైద్య శిబిరంలో భాగంగా స్థానిక ఎస్ భవన్‌లో డాక్టర్ డి.శారద ఆధ్వర్యంలో షుగర్, బిపి పరీక్షలు చేసి మందులు అందించారు. ఎన్సీడీఎస్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మితాహారం, శారీరిక వ్యాయామం ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ రాజ్ కుమార్ ను సత్కరిస్తున్న అసోసియేషన్ బృందం

సైడ్‌ఎఫెక్ట్స్ లేని వైద్యం ఫిజియోథెరపీ

ప్రజాశక్తి - తెనాలి

ఆధునిక జీవన విధానంలో ఆరోగ్య సమస్యలు అనేకమని, వాటి చికిత్స విధానంలో సైడ్‌ఎఫెక్ట్స్ లేని ఫిజియోథెరపీ మెరుగైన ఫలితాలను ఇస్తుందని అను ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ కొత్తపల్లి రాజ్‌కుమార్ చెప్పారు. స్థానిక నందుల పేట కవిరాజా పార్కులో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ శరీరంలో సంభవించే వివిధ రకాల నొప్పులకు తరచుగా మందులు, స్టెరాయిడ్స్ ఉపయోగించకూడదని, వాటితో సైడ్‌ఎఫెక్ట్స్ ఉంటాయని, ఫిజియోథెరపీతో అయితే ఎలాంటి ఇబ్బందీ ఉండదని చెప్పారు. వైద్యరంగంలో ఫిజియోథెరపీ కీలకంగా మారిందని, మోకాళ్ళ నొప్పులు వస్తే వారు శారీరక పెరుగుదల నియంత్రించాలని, డయాబెటిస్, పక్షవాతం వంటి వాటికి ఫిజియోథెరపీలో ఆధునిక వైద్యాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సత్యన్నారాయణ, ప్రసాదం పూర్ణచంద్రరావు, సభ్యులు కె.వెంకటకోటయ్య, చలమయ్య, హనుమారెడ్డి ఎం.రామయ్య, కోటిరెడ్డి పి.శివరామయ్య, అజ్గర్ అలి పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ప్రగడ నవదుర్గ ప్రసాద్ పుట్టినరోజు వేడుకలను చినకాకానిలోని షైన్ ఆనంద శరణాలయంలో శనివారం రాత్రి నిర్వహించారు. జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి నవదుర్గ ప్రసాద్ షైన్ ఆనంద శరణాలయంలో చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా శరణాలయం చిన్నారులకు భోజనం ఏర్పాటు చేశారు. ఏపీడబ్ల్యూజే మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి బత్తుల సాంబశివరావు, ప్రగడ బ్రహ్మేశ్వరి, శిరీష ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు పాల్గొన్నారు.

గతుకులమయంగా వాకింగ్ ట్రాక్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో నిర్మించిన వాకింగ్ ట్రాక్ కంకర రాళ్లు, గతుకులమయంగా మారింది. 2015-16 ఏడాది మధ్య కాలంలో సుమారు రూ.60 లక్షలతో సిఆర్‌డిఎ ఆధ్వర్యంలో వాకింగ్ ట్రాక్‌ను నిర్మించారు. పచ్చని మొక్కలు, పూలచెట్లతో ఆహ్లాదకరంగా ఉండేలా వాకింగ్ ట్రాక్‌ను తీర్చిదిద్దారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి నడక, పరుగు ఎంతగానో దోహదపడుతుంది. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు, మహిళల విజ్ఞప్తితో అప్పటి ప్రభుత్వం స్థానిక తులసి థియేటర్ ఎదురుగా ఎర్రమాసు చెరువును వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేసింది. పెద్దలతో పాటు చిన్న పిల్లలకు సైతం ఊయల, జారుడు బల్ల లాంటివి ఏర్పాటు చేశారు. కొత్తగా నిర్మించడంతో పెద్ద సంఖ్యలో పెద్దవాళ్లు, పిల్లలు వాకింగ్ ట్రాక్‌కు వచ్చేవారు. 30-40 ఏళ్లు పైబడినవారు వాకింగ్, యువత రన్నింగ్ పట్ల ఆసక్తి కనబరిచేవారు. 2019లో వైసిపి అధికారంలోకి రావడం, అప్పటికే వాకింగ్ ట్రాక్ గతుకులమయంగా మారడంతో నడక, రన్నింగ్ చేసేవారి సంఖ్య క్రమేపీ తగ్గుతూ వచ్చింది. వైసిపి ప్రభుత్వం వాకింగ్ ట్రాక్ అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో వాకింగ్ ట్రాక్ గతుకులు, ఎత్తు పల్లాలుగా ఉండడంతో కాళ్లు బెణకడం, గాయాలు కావడం లాంటి సమస్యలు ఎదురవుతున్నాయని వాకింగ్ ట్రాక్‌కు వచ్చేవారు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి నోచుకుంటుందని ఆశిస్తున్నామని వాకర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, సిఆర్‌డిఎ అధికారులు స్పందించి వాకింగ్ ట్రాక్ అభివృద్ధిపై సత్వరమే దృష్టి సారించాలని కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధిలో నిబద్ధత కలిగిన ఉద్యోగుల పాత్ర కీలకం

గోలివరదరాజు సన్మాన సభలో జిల్లా సివిల్ జడ్జి తాడిపర్తి హరిత



వరదరాజులను సన్మానిస్తున్న అతిథులు

ప్రజాశక్తి - మంగళగిరి

పంచాయితీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా మంగళగిరి నియోజకవర్గంలో పాటు అనేక జిల్లాల్లో ప్రభుత్వ ఉద్యోగిగా సేవలందించిన మంగళగిరి నివాసి గోలి వరదరాజు ఉద్యోగ విరమణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వారి ఇంటివద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రగతిశీల కవి గోలి మధు ఆధ్వర్యంలో జరిగిన సభకు గోలి సౌమ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా మంగళగిరికి చెందిన డిస్ట్రిక్ట్ సివిల్ జడ్జి తాడిపర్తి హరిత మాట్లాడారు. గ్రామల అభివృద్ధిలో నిబద్ధత కలిగిన ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని, నీతి, నిజాయితీ, నిబద్ధతతో కూడిన ఉద్యోగుల కారణంగానే గ్రామల్లో అభివృద్ధి జరుగుతోందని అన్నారు. వరదరాజు వంటి అంకితభావం కలిగిన ఉద్యోగులు అభివృద్ధి ప్రదాతలుగా నిలుస్తారని చెప్పారు. కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, గుంటూరు జిల్లా ఎస్ఇ బ్రహ్మయ్య, ఎంపిడిఒ శ్రీనివాసరావు, దుగ్గిరాల మాజీ జెడ్‌పిటిసి యేళ్ల జయలక్ష్మి, తోట పిచ్చయ్య వరదరాజు, సహచర ఉద్యోగులు, స్నేహితులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు మేలు చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్న పథకాలు తదితర అంశాలపై జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. కౌలు రైతులందరికీ పంట రుణాలు అందించేలా వ్యవసాయశాఖ, రెవెన్యూ, బ్యాంకు అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, దీనిపై ఉన్న నిబంధనలను సరళతరం చేసి నిజమైన కౌలు రైతులకు బ్యాంకులు రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి చెప్పారు. లాభదాయక పంటల సాగుపై రైతులకు వ్యవసాయశాఖ అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం సబ్సీడీపై అందించే విత్తనాలను రైతులందరికీ అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. నకిలీ ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అరికట్టేందుకు విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో విస్తృతంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. కల్తీ, నాణ్యత లేని విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు తయారీ, విక్రయ కేంద్రాలను, కృత్రిమంగా కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయాలు చేసే వారిపై రానున్న నెల రోజుల్లో పూర్తి స్థాయిలో తనిఖీలు చేసి కేసులు నమోదు చేసి స్పష్టమైన ఫలితాలు కన్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి రవాణా అవుతున్న నకిలీ ఎరువులు, పురుగుమందులు, విత్తనాలపైన నిఘా పెట్టాలన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల విక్రయాలపై ఫిర్యాదులను ఇచ్చేందుకు ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నబరు ఏర్పాటు చేయాలని, దీనిని ప్రతి వ్యాపార సంస్థ వద్ద ప్రదర్శించాలని చెప్పారు. ఫిర్యాదులను ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పరిశీలించేలా రిజిస్టర్ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకోసం ప్రవేశ పెట్టిన పథకాలను మంచిగా అమలు చేస్తున్న రాష్ట్రలకు సంబంధించిన వివరాలను సేకరించి, అవే విధానాలను జిల్లాలోను అనుసరించేందుకు అవసరమైన నివేదిక అందించాలన్నారు. భూసార పరీక్షలు, విత్తనాలు, ఎరువులు శాంపిల్స్ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఇరిగేషన్‌కు సంబంధించి ప్రధాన, మేజరు, మైనర్ కాల్వలతో పాటు, పంట కాల్వలు పూర్తి స్థాయిలో గుర్రపు డెక్క తొలగించి, సాగు నీరు సక్రమంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సహకార బ్యాంకులో అవకతవకలపై విచారణను వేగవంతం చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం పథకాల ద్వారా అందించే అర్థిక సహాయంపై ఉన్న అవకాశాలను పరిశీలించి ప్రతిపాదనలు అధికారులు అందించాలన్నారు. ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్ వివిధ అంశాలపై మాట్లాడుతూ డిసిసిబిలో రైతుల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా రుణాలు మంజూరు, ఇతర ఆర్థిక అవకతవకలపై అసలు సూత్రదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, జెసి జి.రాజకుమారి, విజిలెన్సు ఎస్‌పి కె.ఈశ్వరరావు, జిల్లా మత్యశాఖ అధికారి గాలి దేముడు, జిల్లా ఎపిఎంఐ పీడీ వజ్రశ్రీ, జిల్లా ఇరిగేషన్ ఎస్ఇ ఉమామహేశ్వరరావు, లాం ఏడీఆర్ దుర్గాప్రసాద్, సిపివో పి.శేషశ్రీ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ సంగీత దినోత్సవం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక కొత్తపేట తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి ప్రపంచ సంగీత దినోత్సవం నిర్వహించారు. కానూరు వెంకట రామకృష్ణ సంగీత మిత్ర బృందం ఆధ్వర్యంలో ముందుగా పెసర్లంక వసంత దుర్గ శిష్య బృందం, చల్ల యామిని శిష్య బృందం నృత్య ప్రదర్శన జరిగింది. తదుపరి కొండపి వసుంధర బృందం, గౌరావఝుల ఆంజనేయ శాస్త్రి బృందం, లక్ష్మి సునీత బందం, కొలిశెట్టి బాలా త్రిపుర సుందరి బృందం, మాదల గార్గి బృందం త్యాగరాజు కీర్తనలు ఆలపించారు, మృదంగంపై కానూరు వెంకట రామకృష్ణ, వయోలిన్ పై చావలి శ్రీనివాస్, తబలాపై పెరవలి వంశీకృష్ణ, కీబోర్డుపై సాయి వాయిద్య సహకారం అందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెనాలి కళావైభవానికి ప్రతీకగా ప్రపంచ సంగీత దినోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా, సంగీత, నత్య గురువులను సత్కరించారు. కార్యక్రమాన్ని శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు పర్యవేక్షించగా డాక్టర్ పురుషోత్తమరావు, లక్కరాజు కనకదుర్గ, వినతి, ఎం.సత్యకుమారి, కె.రమాదేవి, ఎ.బాలచంద్రమౌళి, కేశవరావు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి : సిపిఎం

(మొదటి పేజీ తరువాయి)

పెరిగిపోయాయని, దీనికి తగిన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షం వస్తే నీరంతా రోడ్లపై నిలబడుతుందని అన్నారు. కుంచనపల్లి ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగాలేక భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయన్నారు. కృష్ణా పుష్కరాల సందర్భంగా రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్లు తొలగించిన వారికి ఇంతవరకు ప్రత్యమ్నాయ స్థలాలు చూపలేదని, వెంటనే వారికి ప్రత్యామ్నాయ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెద్దవడ్లపూడి హైలెవల్ ఛానల్‌ను పూర్తి చేయాలని, గుంటూరు ఛానల్, కొండవీటివాగు తదితర పంట కాల్వల్లో తూడు కాడను తొలగించాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత 60 ఏళ్ల నుంచి 600 కుటుంబాలు రైల్వే స్థలాల్లో నివాసం ఉంటున్నారని, కృష్ణ నగర్, రామయ్య కాలనీలో ఫారెస్ట్ భూముల్లో వందలాది కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, సుందరయ్య నగర్, అమరారెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో వేలాది కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, వారందరికీ పట్టాలు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు కె.కరుణాకరరావు, డి.శ్రీనివాసకుమారి, జి.సుబ్బారెడ్డి, వి.దుర్గారావు పాల్గొన్నారు.

మున్సిపల్ హైస్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత

- గణనీయంగా పెరిగిన విద్యార్థుల సంఖ్య
- సౌకర్యాల్లో కార్పొరేట్ స్కూల్స్ కంటే మిన్నగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు పట్టణంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో కొంతకాలంగా ఉపాధ్యాయుల కొరత పట్టి పీడిస్తోంది. గత ప్రభుత్వం విద్యారంగంలో తీసుకువచ్చిన సంస్కరణలతో మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. నాడు- నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలో మునుపెన్నడు లేనివిధంగా సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, వసతులు మెరుగయ్యాయి. విద్యార్థులకు నాణ్యత మైన విద్యను అందించడానికి గత ప్రభుత్వం అన్ని విధాలుగా తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలతో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా చదువులో పోటీపడేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకున్నారు. కాగా కొన్ని సంవత్సరాలుగా మున్సిపల్ హై స్కూల్స్ లో అదనపు తరగతులు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో కొన్ని ఏళ్ల తరబడి పొన్నూరు నేతాజీ నగర్ మున్సిపల్ హైస్కూల్లో వరండాలో, చెట్ల కింద తరగతులు నిర్వహించిన పరిస్థితులు లేకపోలేదు. విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్ లేకపోవడంతో విద్యార్థులు పలు అవస్థలు పడ్డారు. నిడుబ్రోలు కొండముది రోడ్డు ఐదవ వార్డులోని మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు ఆట స్థలము లేక శారీరిక దారుఢ్యం, మానసిక వికాసాన్ని కోల్పోతున్నారు.

శ్రీరామ మున్సిపల్ హైస్కూల్ ముందు దుర్గంధం తో సైడ్ కాలువలో పారని మురుగు

శ్రీరామ మున్సిపల్ హైస్కూల్లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి

స్థానిక శ్రీరామ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు తాగునీటి సమస్య తీర్చడానికి గత ఏడు సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు షెడ్డు నిర్మాణం చేపట్టారు. కానీ యంత్ర పరికరాలు షెడ్డులో అమర్చక పోవడంతో ప్రయోజనం శూన్యంగా మారింది. ఈ పాఠశాలకు నాడు -నేడు పథకం కింద పలు అభివద్ధి పనులు చేశారు. కానీ ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కాంట్రాక్టర్ ను కోరడం జరిగింది. అయితే గతంలో ఇక్కడ ఆరో ప్లాంట్ నిర్మాణం చేసినట్లు రికార్డులు చూపిస్తున్నాయని కాంట్రాక్టర్ సెలవిచ్చారు. దీనివల్ల ఆర్ఓ ప్లాంట్ నిర్మాణం కుదరదని చెప్పారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. దీంతో విద్యార్థులకు పరిశుభ్రం లేని నీరు తాగాల్సిన గతి పట్టింది. ఈ పాఠశాల ఉత్తరం, పడమర వైపు ప్రహరీ గోడ ఎత్తు పెంచకపోవడంతో ఆకతాయిలు గోడ దూకి స్కూలు లోపలికి వస్తున్నారని ఉపాధ్యాయులు వాపోతున్నారు. శ్రీరామ మున్సిపల్ పాఠశాల చుట్టూ పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. శ్రీరామ హైస్కూల్ ముందు ఉన్న డ్రైనేజీ లో మురుగు పారుదల లేకపోవడంతో మారిన వాతావరణం, వర్షాకాలంతో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు సాగుతాయేమోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాం దోళన చెందుతున్నారు.ముందు జాగ్రత్తగా ఈ పాఠశాల చుట్టూ సున్నం బ్లీచింగ్ చల్లించి అంటు వ్యాధులు ప్రబలకుండా సానిటరీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక వార్డు ప్రజలు కోరుతున్నారు.

టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ను నియమించాలి

స్థానిక మున్సిపల్ హై స్కూల్స్ లో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పట్టణంలోని మున్సిపల్ హై స్కూల్స్ లో ప్రధానంగా ఫిజికల్ డైరెక్టర్లు, క్రాఫ్ట్ టీచర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, వాచ్మెన్,అటెండర్లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిడుబ్రోలు ఐదవ వార్డు కొండముది రోడ్డులోని మున్సిపల్ హైస్కూల్లో నిర్మాణంలో ఉన్న తరగతి గదుల్లో వైరింగ్, ఫ్లోరింగ్ చేయాలి. ఖాళీగా ఉన్న ఇంగ్లీష్,తెలుగు, బయాలజీ, హిందీ పోస్టులను భర్తీ చేయాలి. అదేవిధంగా శ్రీరామ మున్సిపల్ హైస్కూల్లో ఇంగ్లీష్ , క్రాఫ్ట్ టీచర్, ఉర్దూ టీచర్ పోస్టులను భర్తీ చేయాలి. ఈ హైస్కూల్ లో అధిక శాతం మంది ముస్లిం మైనార్టీ విద్యార్థిని, విద్యార్థులు చదువుతున్నారు. సెకండ్ లాంగ్వేజ్ కింద ఉర్దూ పాఠ్యాంశాన్ని ఎంచుకుంటారు. ఈ పాఠశాలకు కొత్తగా ఈ విద్యా సంవత్సరంలో ఎంతోకాలంగా కోరుతున్న కొత్త ఉర్దూ పోస్టు మంజూరు చేయాలని ఉన్నత విద్యాశాఖ, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులను స్థానిక విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

శ్రీరామ మున్సిపల్ హైస్కూల్లో నిరూపయోగంగా ఆర్వో ప్లాంట్ యంత్రాలు లేని షెడ్డు

ప్రజా సమస్యల పరిష్కారానికి నేడు 'మీకోసం'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతి సోమవారం నిర్వహించే మీ కోసం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం కోసం పోలీస్ శాఖ కషి చేస్తుందని సోమవారం 2వ పట్టణ పోలీసు స్టేషన్ లో పరిధిలో ఉండే ప్రజల సమస్యలు పరిష్కారం కోసం మీకోసం (స్పందన) కార్యక్రమం చేపట్టనున్నట్లు సిఐ ఆవుల భాస్కరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని 2 వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిఐ కోరారు.

'మీ కోసం'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-వినుకొండ

వినుకొండ రూరల్ సీఐ సుధాకరరావు ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమాన్ని విజయవంతం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మీ సమస్యలపై వినుకొండ రూరల్ మండలాల(ఈపూరు, నుజండ్ల, బొల్లాపల్లి ,శావల్యాపురం) ప్రజలు సుదూర ప్రాంతాల నుండి జిల్లా ఎస్పీ మల్లిక గార్గ్‌కి ఫిర్యాదు చేసేందుకు పల్నాడు జిల్లా, నరసరావుపేట ఎస్పీ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే వినుకొండ రూరల్ సర్కిల్ ఆఫీస్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లుగానే భావించి, మీరు ఇచ్చిన ఫిర్యాదులను స్వీకరించినట్లుగా రిసిప్ట్ కూడా ఇవ్వడం జరుగుతుందని, ఆ ఫిర్యాదులపై సత్వర పరిష్కారం జరుగుతుందని సిఐ అన్నారు.

కంటి వ్యాధులపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-గుంటూరు

బయట ప్రపంచానికి మనకూ బంధం ఏర్పరిచే పంచేయాద్రియాల్లో అతిముఖ్యమైన కన్ను విషయంలో అప్రమత్తంగా ఉండాలని కంటి వ్యాధులపై నిర్లక్ష్యం తగదని నేత్రవైద్య నిపుణులు డాక్టర్ పద్మప్రియ అన్నారు. కంటి సమస్యలు-చికిత్స అనే అంశంపై అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్య సభకు అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. శంకర్ కంటి ఆస్పత్రికి చెందిన సీనియర్ నేత్రవైద్యులు డాక్టర్ పద్మప్రియ మాట్లాడుతూ 40 ఏళ్లు పైబడిన వారు కంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ సమస్యలుంటే నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్లను సంప్రదించాలన్నారు. శుక్లాలు, నీటి కాసులు కంటి కలక, రెటీనా లేడీ జార్జర్, ఐలిడ్ ప్రాబ్లమ్ వంటి కంటి వ్యాధులు ఈ మధ్య చాలా ఎక్కువగా వస్తున్నాయన్నారు. 40 ఏళ్ల తర్వాత వివిధ కంటి సమస్యలు ఎదురవుతూ ఉంటాయని, సమస్యను సత్వరమే గుర్తించి కళ్లద్దాలు వాడటంతో ఆ సమస్యకు కొంత మేరకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. చూపులకు అడ్డంపడి చికాకును కలిగించే ఫ్లోటర్స్ సమస్య ఉన్నప్పుడు మాత్రం డాక్టర్‌ని సంప్రదించాలన్నారు. వృద్ధాప్యంలో డ్రై ఐస్ పరిస్థితి ఏర్పడినప్పుడు కంటిని తడిగా ఉంచటానికి ప్రత్యేకమైన ఐడ్రాప్స్ వాడాలని సూచించారు. కంటిలో నీళ్లు ఎక్కువగా కారేవాళ్లు కూలింగ్ గ్లాసెస్ వాడాలని, ఇన్‌ఫెక్షన్ల వల్ల కొన్ని కెమికల్స్ సోకటం వల్ల ఎలర్జీల వల్ల వచ్చే కంటికలక వ్యాధి గురించి డాక్టర్ సంప్రదించాలని చెప్పారు. కంటికి సంబంధించిన ప్రధాన సమస్య గ్లకోమా అని పిలవబడే నీటికాసుల వ్యాధి అని, కంటిలో ఫ్లూయిడ్ ఎక్కువగా ఉండటం వల్ల గ్లకోమా పరిస్థితి నెలకొంటుందని వివరించారు. రక్తపోటు, మధుమేహ వ్యాధులు కంటినరాన్ని దెబ్బతీస్తాయన్నారు. అనంతరం శంకర హాస్పిటల్ పిఆర్ఒ కాశీప్రసాద్, సురేంద్ర ప్రసంగించారు. డాక్టర్ పద్మప్రియను సంస్థ సభ్యులు సత్కరించారు. తొలుత నిర్వహించిన వైద్యశిబిరంలో 260 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు.

మాట్లాడుతున్న డాక్టర్ పద్మప్రియ

నేడు శంకుస్థాపన చేయనున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయపురిసౌత్

వెల్దుర్తి మండలం ఉప్పలపాడు నుంచి దుర్గి మండలం ముటుకూరు వరకు 17.6 కిలోమీటర్ల రహదారి కొన్ని దశాబ్దాలుగా వేయలేక పోయిన ఈ రహదారిని ఎమ్మెల్యేగా గెలుపొందిన 10 రోజులకే ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది సుమారు నాలుగు కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9 గంటలకు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు

మద్యం కేసులో శివనాగేంద్రం అరెస్టు

ప్రజాశక్తి - మంగళగిరి

ఈ నెల మూడో తేదీన మంగళగిరి పట్టణంలోని కాండ్రు వారి వీధిలోని నివాసంలో 136 కేస్‌ల అక్రమ మద్యంను మంగళగిరి సేబ్ అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ 2 గా ఉన్న కాండ్రు శివ నాగేంద్రంను విజయవాడలో మంగళగిరి ఎన్ఫోర్స్మెంట్ అధికారులు అదుపులోకి తీసుకొని శనివారం రాత్రి అరెస్ట్ చేశారు.మద్యం లభించిన ఇంటి యజమానిని ఏ 1 గా అరెస్ట్ చేశారు. మద్యం సీసాలపై ప్రభుత్వ స్టిక్కర్ సీల్‌ను తొలగించటంతో మద్యం ఏ దుకాణాల నుండి వచ్చిందనేది నిర్ధారణ కాలేదు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండగా వేలాదిగా భారీగా మద్యం సీసాలు ఏ ప్రభుత్వ మద్యం దుకాణాల నుండి బయటకు వచ్చాయి. దీనిలో సూత్ర దారులు పాత్రధారులు ఎవరు? సమగ్ర దర్యాప్తు చేస్తే కీలక నిందితులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. కాగా ఈ కేసులో మాజీ మున్సిపల్ కౌన్సిలర్‌ను, వైసిపికి చెందిన మండల పార్టీ నాయకుడు ఈ కేసులో ఉన్నట్లుగా తెలిసింది. వారిని కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉందని సమాచారం.

చినకాకానిలో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

మంగళగిరి రూరల్ పరిధిలోని గుర్తుతెలియని మృతదేహాన్ని రూరల్ పోలీసులు గుర్తించారు. రూరల్ ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం మంగళగిరి మంగళగిరి మండల రూరల్ ప్రాంతమైన చిన్నకాకాని గ్రామంలోని హాయ్ ల్యాండ్ సమీపంలో గోడౌను పక్కన పాత నివాసగృహం పైన గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు ఆదివారం గుర్తించారు. మృతుడి వయసు సుమారు 50 నుంచి 55 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, టీ షర్టు ధరించి ఉన్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. ఈ గుర్తు తెలియని మతదేహానికి సంబంధించి ఎలాంటి సమాచారం తెలిపినచో రూరల్ పోలీస్ స్టేషన్కు తెలియజేయాలని రూరల్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రూరల్ ఎస్సై జె క్రాంతి కిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేని కలిసిన దళిత బహుజన ఫ్రంట్

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల నియోజకవర్గం నూతన ఎమ్మెల్యే గా ఎన్నికైన జూలకంటి బ్రహ్మారెడ్డిని ఆదివారం వెల్దుర్తి లోని క్యాంపు కార్యాలయంలో దళిత బహుజన ఫ్రంట్ పల్నాడు జిల్లా జనరల్ సెక్రెటరీ వడ్డె మధుసూదనరావు, టీం సభ్యులు కలిశ్వారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో ఏపీ కి రాజధాని నిర్మాణము లేక, రాష్ట్రంలోని చదువుకున్న నిరుద్యోగులకు,ఉద్యోగాలు లేక అందరూ రోడ్డున పడ్డారని విమర్శించారు. పొట్ట చేత పట్టుకుని ఇతర రాష్ట్రాలకు తక్కువ జీతాలకు వలసలకు వెళ్లడం జరిగిందని, సరైన పనులు లేక అన్ని రంగాల ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారని, సంక్షేమ పథకాలతో ప్రజలను బిక్షగాలుగా చేశారని, దళితులపైనే,ఎస్సీ ఎస్టీ కేసులను పెట్టి, దళితులను టార్గెట్గా చేసి హత్యలు, దాడులు చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో దళిత బహుజనఫ్రంట్ దుర్గి మండల అధ్యక్షురాలు చల్లా సంపూర్ణమ్మ , మాచర్ల మండలం నాయకులు నరమాల చంద్రయ్య ,కల్లు జయన్న , సైదయ్య ,కోటయ్య , కె. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో సీట్లు సాధించిన ముగ్గురు విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అకాడమిక్ విద్యతోపాటు, పోటీ పరీక్షలకు ప్రాథమిక తరగతుల నుండే ప్రిపేర్ కావచ్చని డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకులు షేక్ జాఫర్ అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక శాఖా గ్రంథాలయంలో ముగ్గురు ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ముగ్గురు విద్యార్థులు బ్రాగ్ సెట్, ఎపిఆర్ఎస్ పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులై, సీట్లు సాధించారన్నారు. మంచి ప్రణాళికతో పాటు, మెలకువలు నేర్చుకొని, పోటీ పరీక్షలలో విజయాలు సాధించవచ్చున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ జీవితాన్ని ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్ళేవారు తప్పనిసరిగా విజయం సాధిస్తారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు. షేక్ యాసిన్, షేక్ ఖాసిం, షేక్ హర్షద్ విద్యార్థులను సత్కరించి మెమొంటో, ఇంగ్లీష్ నిఘంటువు అందజేశారు. కార్యక్రమంలో షేక్ కాలేషా, షేక్ సుభాని పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికైనందుకు సత్కారం

ప్రజాశక్తి-వినుకొండ

గుజరాత్‌లోని వడోదర విశ్వవిద్యాలయంలో చదువుకున్న సువర్చల అనంతపురంలోని అగ్రికల్చర్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికైన సందర్భంగా ఆమెను సత్కరించారు. ఆదివారం స్థానిక భ్రమరా టౌన్షిప్ లోని డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో విద్యార్థులు ఉపాధ్యాయులు బృందం, సువర్చల ను దుశ్శాలువాతో పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన విజయంలో డాక్టర్ లక్ష్మయ్య పాత్ర మరువలేనిదని, వారి సహాయ సహకారాలతో సాధించాలని త్వరలో ఐఏఎస్ గా ఎంపికయి డాక్టర్ లక్ష్మయ్య ద్వారా సన్మానం చేయించుకుని వినుకొండ నుండి వెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ లక్ష్మయ్య అడ్మిన్ డైరెక్టర్, అకాడమిక్ డైరెక్టర్ ఫంకస్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ఆర్థిక ప్రోత్సాహం

ప్రజాశక్తి-ఈపూరు

పండ్ల,పూల తోటల పెంపకానికి ప్రభుత్వం మూడేళ్ల కాల పరిమితితో ఆర్థిక ప్రోత్సాహం అంది స్తుందని నీటి వసతి కలిగిన రైతులు స్థానిక ఉపాధి హామీ పథక కార్యాలయం నందు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ లక్ష్మణ్ తెలిపారు. ప్రభుత్వం ఉపాధి హామీ కింద ఉద్యానవన తోటల పెంపకంను చేర్చారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మామిడి, బత్తాయి, నిమ్మ,మునగ, మల్లె,గులాబీ, సపోటా,దానిమ్మ, డ్రాగన్, నేరేడు, సీతాఫలం, చింత, జామ తోటల పెంపకానికి అవకాశం ఉందన్నారు .చిన్న, సన్నకారు రైతు సంబంధిత కార్డులు తీసుకొని ఉపాధి హామీ సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించండి

- రావాల్సిన బెనిఫిట్స్ తక్షణమే అమలు చేయండి - టిడిపి నాయకుల రాజకీయ వేధింపులు అరికట్టండి
- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కూటమి ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీ సమ్మె సమయంలో గత ప్రభుత్వ ఒప్పందాలు అంగీకరించిన అంశాలు, మినిట్స్ కాపీ ఆధారంగా జీఓ ఇవ్వాలని కోరారు. అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ. 50 వేల నుండి రూ 1 లక్షకు, హెల్పర్ కు రూ 20 వేల రూ నుండి 40 వేలకు పెంచుతూ జీఓ నెం.47 ఇచ్చారని దీనిని సవరణ చేసి మినిట్స్ కాపీలో అంగీకరించిన విధంగా వర్కర్ కు రూ.1.20 లక్షలు, హెల్పర్ కు రూ 60 వేలు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా, రొంపిచర్ల మండలం గోగులపాడు, సుబ్బయ్యపాలెం, నరసరావుపేట మండలం ఇక్కుర్తి తదితర గ్రామాల్లో టిడిపి నాయకులు అంగన్వాడీలపై, ఇతర చిరు ఉద్యోగులపై వేధింపులకు పాల్పడుతున్నారని, రాజీనామాలు చేయాలని బెదిరిస్తున్నటు యూనియన్ దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యేకు వివరించారు. ఒకవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కక్షపూరిత రాజకీయాలకు స్వస్తి చెప్పాలని పదేపదే చెబుతున్నారని, గ్రామ స్థాయిలో టిడిపి నాయకులు, చిరుద్యోగులపై వేధింపులకు పాల్పడడాన్ని నివారించాలని కోరారు. గౌరవ వేతనంతో పనిచేస్తున్న ఒక చిరు ఉద్యోగి పై ఆధారపడి ఒక కుటుంబమే ఉంటుందని గ్రహించాలని, ప్రభుత్వాలు మారిన ప్రతిసారి చిరు ఉద్యోగులపై వేధింపులు రాకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు.

శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి మాట్లాడుతూ అంగన్వాడీలకు జీఓ ప్రకా రం రావాల్సిన బెనిఫిట్‌లను తక్షణమే అమలు చేయాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కెపి. మెటిల్డాదేవి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చా లని, విధుల్లో ఉన్న కాలంలో చని పోయిన అంగన్వాడీలకు, వర్కర్లకు హెల్ప ర్లకు దహనం ఖర్చుల కింద రూ. 20 వేలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం,ప్రధాన మంత్రి జీవిత బీమా పథకం అమలుకు ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. సంక్షేమ పథకాలను అంగన్వాడీలకు వర్తింప చేసి, సాధికారత సర్వేలో 'ప్రభుత్వ ఉద్యోగులు' అనే పదాన్ని తొలిగించాలన్నారు. దీనిపై ఉన్నత స్థాయి సబ్ కమిటీ ఏర్పాటు చేసి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సంపూర్ణపోషణ మెనూ, మెనూ ఛార్జీలు పెంపు,యాప్ ల కుదింపు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు భర్తీ, వర్కర్లకు పంపిణీ చేసిన సెల్ ఫోన్ సమస్యలు, లబ్ధిదారులకి నాణ్యమైన సరుకుల సరఫరా, ఇళ్ల స్థలాలు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో సిఐటియు పట్టణ కార్యదర్శి షేక్ సిలార్ మసూద్, యూనియన్ నాయకులు నిర్మల, మాధవి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

ఆక్రమిత భూమి తిరిగి ఇవ్వకపోతే సజీవదహనమవుతా

- మాజీ మంత్రి విడదల రజిని మామ లక్ష్మీనారాయణ భూ అక్రమాలు
- 50 సెంట్ల స్థలంలో క్రీడాప్రాంగణం పేరిట బలవంతంగా సంతకాలు
- టిడిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బత్తినేని శ్రీనివాసరావు ఆరోపణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

అన్ని వర్గాల ప్రజలను భయపెట్టి భయభ్రాంతులకు గురిచేసి అక్రమ సంపాదనకు మాజీ మంత్రి విడదల రజిని, ఆమె కుటుంబం అనేక అక్రమాలకు పాల్పడిందని పల్నాడు జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి బత్తినేని శ్రీనివాసరావు ఆరోపించారు. ఇటీవల పసుమర్తి గ్రామ రైతులు, రెండు రోజుల క్రితం యడ్లపాడు స్టోన్ క్రషర్ వ్యాపారులు, రజిని, ఆమె మరిది గోపి, పిఎ రామకృష్ణలపై జిల్లా పోలీసు కార్యాలయంలో ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు విదితమే. తాజాగా పల్నాడు జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బత్తినేని శ్రీనివాసరావు ఆదివారం తన కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడారు. రజిని మామ విడుదల లక్ష్మీ నారాయణ భూ అక్రమాలపై మాట్లాడారు. ఆ తర్వాత రజిని కుటుంబ సభ్యుల అక్రమాలపై ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. బత్తినేని వంశస్థుల కుటుంబానికి, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు చెందిన 50 సెంట్ల స్థలంలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేస్తున్నామని బలవంతంగా సంతకాలు చేయించుకుని ఫెన్సింగ్ వేసుకొని ఆక్రమించారన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ మని కూడా చూడకుండా తనను కూడా బెదిరించి భయభ్రాంతులకు గురిచేశారని, చంపేస్తామని కూడా బెదిరించారని ఆరోపించారు. స్థలంలో పెద్దల సమాధులు ఉన్నాయని వాటి జోలికి రావొద్దని చెప్పినా లెక్క చేయకుండా అక్రమంగా కాజేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పురుషోత్తపట్నంలో పశు వైద్యశాలకు, స్వాతంత్ర సమర యోధులు విగ్రహాల ఏర్పాటుకు స్థలాన్ని దానం చేసిన చరిత్ర తమదని పేర్కొన్నారు. తమ భూమిని తమకు ఇప్పటికైనా తిరిగి ఇవ్వని పక్షంలో స్థానిక పురుషోత్తమపట్నంలోని రజిని, లక్ష్మీనారాయణ ఇంటి ముందు సజీవ దహనం చేసుకుంటానని హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంలో రజిని పిఎ దొడ్డా రామకృష్ణ హస్తం ఉందని ఆరోపించారు. రజిని, విడదల గోపి,విడదల లక్ష్మీనారాయణ, విడదల కుమారస్వామి చేసిన అరాచకాలు, భూకబ్జాలపై ఒక నివేదిక తయారు చేసి సిఎం చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకి త్వరలోనే వినతిపత్రాలు అందజేస్తానని చెప్పారు.

మాట్లాడుతున్న బత్తినేని శ్రీనివాసరావు

అంకితభావం కలిగిన అధికారి నాగయ్య

ప్రజాశక్తి - మాచర్ల

విద్యాశాఖలో ఎన్నో ఒడుదుడుకులు ఎదుర్కొంటు సర్వీస్ మొత్తం క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసిన వ్యక్తి వేముల నాగయ్య అని మదర్ థెరిస్సా సేవా సమితి నాయకులు జక్కిరెడ్డి మర్రి రెడ్డి అన్నారు. సేవాసమితి కార్యాలయంలో ఆదివారం పదవీ విరమణ చేసిన ఎంఇఒ నాగయ్యకు ఘన సన్మానం చేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు గజకిరెడ్డి, గాద కిరీట్ రెడ్డి జక్కిరెడ్డి, సేవా సమితి సభ్యులు చిన్నపరెడ్డి, మర్రెడ్డి, విజయలక్ష్మి పండిట్ శాంతిరెడ్డి, పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన వారికి సన్మానం

ప్రజాశక్తి- వినుకొండ

పట్టణంలో రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే ఉద్యోగి కమర్షియల్ సూపర్వైజర్ చామర్తి భవాని శంకర్ పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు, వినుకొండ పట్టణ ప్రముఖులు అందరూ పాల్గొని భవానీశంకర్ సేవలను కొనియాడారు.

ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు మక్కిన మల్లికార్జున రావు, భవానీశంకర్, భార్య కామే శ్వరిని శాలువాలతో సత్కరించారు.అనంతరం పివి సురేష్ బాబు,రైల్వే సీనియర్ డిసిఎం దిలీప్ కుమార్ మాట్లాడారు.

వినుకొండ తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న అబ్బూరి వెంకటేశ్వర్లు పదవీ విరమణ కార్యక్రమాన్ని కార్యాలయ ఆవరణలో ఆదివారం సిబ్బంది నిర్వహించారు. సభా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే మక్కిన మల్లికార్జునరావు పాల్గొని మాట్లాడారు.అనంతరం అబ్బూరి దంపతులను దుశ్శాలువాతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి తహశీల్దార్ పి.బ్రహ్మయ్య, వినుకొండ ఎంపిపి వెంకట్రామిరెడ్డి, తహశీల్దార్ దానియేలు

సీడ్ యాక్సెస్ రైతులకు ప్యాకేజీ పెంచి ఇవ్వాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఉపాధ్యక్షులు జొన్నా శివశంకరరావు

రైతుల సమావేశంలో మాట్లాడుతున్న శివశంకరరావు

ప్రజాశక్తి-తాడేపల్లి

రాజధాని అమరావతిలో సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణానికి రైతులకు ఇస్తామంటున్న ప్యాకేజీ పెంచి ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఉపాధ్యక్షులు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. సీడ్ యాక్సెస్ రోడ్డు రైతుల సమావేశం రైతు సంఘం నాయకులు ఈశ్వరరెడ్డి అధ్యక్షతన ఉండవల్లిలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణయ్య, శివశంకర్‌రావు మాట్లాడుతూ సీడ్ యాక్సెస్ రోడ్డు వల్ల భూమి కోల్పోయే రైతులకు ప్యాకేజీ పెంచి ఇవ్వాలని, లేకుంటే భూమికి భూమి ఇవ్వాలని కోరారు. అంతేగానీ రైతులను బెదిరించి భూములు లాక్కోవడానికి ప్రయత్నం చేస్తే ఊరుకునేదిలేదన్నారు. రైతులకు ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని సిఆర్‌డిఎ అధికారులకు తీసుకోవాలని, సామరస్య వాతావరణంలో సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇప్పటికే కోట్ల రూపాయల్లోకి వెళ్లిన భూములకు గతంలో ప్రకటించినట్లు కాకుండా జరీబ్ భూములకు 2400 గజాలు, మెట్ట భూములకు 2000 గజాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూములు ధరల్లేని ఐనవోలు, నీరుకొండ, నిడమర్రు, కురగల్లు తదితర భూముల మాదిరిగా ఉండవల్లి, పెనుమాక భూములకు కూడా ఒకే దామాషా ప్రకారం ప్లాట్లు కేటాయిస్తే ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. భూముల విలువను బట్టి అధిక గజాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉండవల్లి, పెనుమాకల్లో ఈ భూములు తప్ప రైతులకు జీవనాధారం లేదని, వారికి గౌరవపదమైన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కె.సాంబిరెడ్డి, బి.పద్మారెడ్డి, పి.వీరస్వామి, జె.నాగిరెడ్డి, షేక్ ఎర్రపీరు, గణేష్, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

ఆంగ్ల భాష శిక్షణకు చిరునామా అపెక్స్

ప్రజాశక్తి-గుంటూరు

ఆంగ్లభాషపై 28 ఏళ్లుగా శిక్షణిస్తూ వేలాది మందిని తీర్చిదిద్దుతూ ఆంగ్ల భాష బోధనకు చిరునామాగా మారిన అపెక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ ఆంగ్లభాష సేవలు అభినందనీయమని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని అపెక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ 28వ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ మాతృభాషతోపాటు ఆంగ్లభాషపై పట్టు సాధించడం ద్వారా దేశ విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు హెచ్చుగా ఉంటాయన్నారు. ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకులు కొత్తపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ గత 28 ఏళ్లలో 500 బ్యాచ్‌ల ద్వారా 25 వేల మందికిపైగా ఆంగ్లభాషపై పట్టు కలిగేలా తీర్చిదిద్దామని తెలిపారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ స్వామి తురియానంద సరస్వతి, డాక్టర్ గుంటుపల్లి లక్ష్మి, సాంబశివరావు, డాక్టర్ మద్దినేని సుధాకర్, ఆకురాతి రవికాంత్, గోటేటి లలిత శేఖర్, ఎం.ఏడుకొండలు, ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

నొప్పి మందులు వాడకాన్ని తగ్గించే ఫిజియోథెరపీ

ప్రజాశక్తి - పొన్నూరు

జీవన విధానంలోనే మార్పుల కారణంగా వయోభేదం లేకుండా శారీరక సమస్యలు అందర్నీ వెంటాడుతున్నాయి. వీటికి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఉపశమనం కలిగించే ఏకైక విధానం ఫిజియోథెరపీ. ఈ వైద్య విధానం ద్వారా టెన్నిస్ ఎల్బో సయాటికా, స్పాండి లైటిస్ ఫ్రోజెన్ ఫోల్డర్ వంటి సమస్యలకు ఏ విధమైన మందులూ వాడకుండా కండరాలు, కీళ్లు, నరాల సామర్థ్యాన్ని పెంచడానికి ఎక్సర్సైజులు, విద్యుత్ పరికరాల ద్వారా చికిత్స చేస్తారు. యువత, సాఫ్ట్వేర్ ఉద్యోగులు, ఫోన్లు, కంప్యూటర్ వాడకం వల్ల భుజాలు, మెడ, నడుము నొప్పులతో బాధపడుతుంటారు. ఇటువంటి వారికి అల్ట్రాసౌండ్, ట్రాక్షన్ టెన్స్, ఐఎఫ్ఐ వంటి పరికరాలతో సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఉపశమనం పొందొచ్చు.

ఎ.శ్రీనివాస్, ఫిజియోథెరపిస్ట్, పొన్నూరు.

పెద్దల్లో ఎదురయ్యే పక్షవాతం, వణకటం, నరాల బలహీనత వంటి సమస్యలను ఫిజియోథెరపీ ద్వారా అధిగమించవచ్చు. స్త్రీలలో ఎముకల బలహీనత కారణంగా మోకాలి సమస్యలు ఎక్కువ. అలాంటివారు ప్రారంభ దశలోనే ఫిజియోథెరపీ చేయించుకోవడం ద్వారా ఆపరేషన్ అవసర పడకుండా చేసుకోవచ్చు. కొంతమంది చిన్నపిల్లల్లో మైల్‌స్టోన్స్ అనగా మెడ నిలపడం, బోర్లపడడం, నడవడం వంటివి ఆలస్యమవుతుంటాయి. పిల్లల డాక్టర్ని సంప్రదించి వారి సూచనలు మేరకు ఫిజియోథెరపీ చేయించుకోవడం మంచిది.

వివిధ రకాల ఆపరేషన్ల అనంతరం రోగుల జీవన విధానం మెరుగుపరచడానికి, రోగి ఎవరిమీదా ఆధారపడకుండా తన పనులు సొంతంగా చేసుకోవడంలో ఫిజియోథెరపీ ఎంతో దోహదపడుతుంది. అధిక బరువు, తద్వారా వచ్చే అనేక సమస్యలను నివారించడంలోనూ ఫిజియోథెరపీ ప్రముఖ పాత్ర వహిస్తుంది.

వైద్యాధికారికి జాతీయ అవార్డు

ప్రజాశక్తి-తాడేపల్లి : స్థానిక డ్రైవర్స్ కాలనీలోని యుపిహెచ్‌సి అత్యుత్తమ పని తీరు ప్రదర్శించినందుకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ జాతీయ అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును వైద్యాధికారి డాక్టర్ మానస ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారికి, యుపిహెచ్‌సి సిబ్బందికి

కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ అండ్ హెల్త్ వెల్ఫేర్ వెంకటేశ్వర్, స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.రమాదేవి, డిఎంహెచ్ఒ డా.కె.విజయలక్ష్మి అభినందనలు తెలిపారు.

శతాబ్ధానికిపైగా ప్రజాసేవలో ఐబి హాస్పిటల్

- విద్యా, వైద్యం, అత్యాత్మిక సేవలతో సుస్థిర స్థానం
- అమెరికన్ హాస్పిటల్ పేరుతో పొన్నూరు ప్రాంతంతో అత్యాధునిక వైద్యం

ప్రజాశక్తి - పొన్నూరు

ప్రపంచంలోని 133 దేశాల్లో స్వయం ప్రతిపత్తితో విద్యా, వైద్యం, సామాజిక సేవ, అత్యాత్మిక రంగంలో ది సాల్వేషన్ ఆర్మీ సంస్థ విశేష సేవలందిస్తోందని పొన్నూరు సాల్వేషన్ ఆర్మీ ఇవాంజిలిన్ బూత్ హాస్పిటల్ ఏడీ కెప్టెన్ కె.కనకరత్నం తెలిపారు. సంస్థ సేవలపై డాక్టర్స్ డే సందర్భంగా ఆయన మాటల్లో...

విద్యాలయాలు : ప్రపంచంలో 133 దేశాల్లో విద్యాలయాలు ఏర్పాటు చేసి విద్యా వ్యాప్తికి సంస్థ కృషి చేసిందన్నారు. మన దేశంలో 6 ప్రాంతీయ భాగాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కొంత భాగం కలిపి ఒక రాష్ట్రంగా ఇండియా మధ్య రాష్ట్రంగా పిలుస్తారు. హైదరాబాద్ విజయవాడ, బాపట్ల చెన్నై నంటి నగరాల్లో విద్యా సంస్థలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని లక్షలాది మంది విద్యావంతులు కావడానికి, ఈ సంస్థ ఎనలేని కృషి చేస్తోంది.

బ్రిటిష్ పాలనలో ప్రారంభం: 1930లో బ్రిటిష్ గవర్నర్ జనరల్ అయిన లార్డ్ ఎరిక్‌సన్ పొన్నూరులోని వైద్యశాలకు శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పొన్నూరు పరిసర ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాం. అప్పట్లో ఉచితంగానే వైద్య సేవలు అందించారు. తదుపరి కాలంలో అతి తక్కువ ఫీజు తో నాణ్యమైన ఆధునిక పరికరాలు ఏర్పాటు చేసి విస్తత స్థాయిలో వైద్య సేవలు అందించారు.

పొన్నూరు ప్రాంతంలో మొదటి నర్సింగ్ కళాశాల : ది సాల్వేషన్ ఆర్మీ ఇవాంజిలీన్ హాస్పిటల్ ద్వారా పొన్నూరు ప్రాంత ప్రజలకు ఉత్తమ వైద్య నేవలు అందిస్తున్న తరుణంలో సంస్థ 1960 దశకంలో సర్సింగ్ విద్యకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంతంలోనే తొలి సర్సింగ్ కళాశాలగా ఇది చరిత్రకెక్కింది. వేలాది మందిని నర్సులుగా తీర్చిదిద్దింది. ఈ కళాశాలలో చదివిన వారు దేశ, విదేశాల్లో మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. ఇక్కడ జిఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సులున్నాయి. ప్రభుత్వ ఫీజులు మాత్రమే తీసుకొని నాణ్యమైన విద్యను అందిస్తున్నాం.

వైద్యశాల విశిష్టత: శతాబ్ధ కాలం పైబడి వైద్య నేవలుందించిన అమెరికన్ హాస్పిటల్ ప్రస్తుతం నూతన భవనంలో నిర్వహించబడుతోంది. రెండున్నర ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఈ వైద్యశాలను నిర్మించారు. అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన ఆపరేషన్ థియేటర్ ఎన్ఐసియు యూనిట్ అందుబాటులో ఉంది. న్యూనానిటల్ యూనిట్ పొన్నూరు పట్టణంలో ఇక్కడ మాత్రమే ఉంది. పుట్టిన పసిబిడ్డలకు చికిత్స కోసం దీన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. ఆధునిక ల్యాబ్ సౌకర్యం, ఎక్స్ రే, ఈసీజీ, 24 గంటలూ వైద్యం అందుబాటులో ఉంటాయి. ప్రసూతి వైద్య నిపుణులు, చిన్నపిల్లల స్పెషలిస్ట్ వైద్యులు, ఛాతి, ఊపిరితిత్తుల వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు. ప్రతి శనివారం ఇఎన్‌టి. ప్రతి ఆదివారం ఆర్థోపెడిక్ వైద్యులు అందుబాటులో ఉంటారు. చికిత్స అనంతరం రోగులు ఉండేందుకు అన్నీ ఏసీ రూములున్నాయి. రోజుకు కేవలం రూ.800 ఫీజుతో వీటిని అందిస్తున్నాం.. అని కెప్టెన్ కె.కనకరత్నం వివరించారు. తమ వైద్యశాలలో అందిస్తున్న చికిత్సలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కెప్టెన్ కె.కనకరత్నం, పొన్నూరు సాల్వేషన్ ఆర్మీ ఇవాంజిలిన్ బూత్ హాస్పిటల్ ఏడీ

పెనుమాకకు ప్రత్యేక స్థానం

ప్రజాశక్తి-తాడేపల్లి

మండల పరిధిలోని పెనుమాక నాడు వైసిపి, నేడు టిడిపి ప్రభుత్వంలో ప్రత్యేక స్థానం సంతరించుకుంది. వైసిపి ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెనుమాక నుంచే అమ్మఒడి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తాజాగా సిఎం చంద్రబాబు సైతం ఇదే గ్రామం నుంచి పింఛన్ పెంపు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నారు. రాజధానిగా అమరావతిలో పెనుమాన ఒక గ్రామం. ఇద్దరు సిఎంలు తొలి పథకం పెనుమాక నుంచే ప్రారంభించడం గమనార్హం.

రాజధాని నిర్మాణంలో స్థానిక కార్మికులకు అవకాశమివ్వాలి : సిఐటియు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - చేబ్రోలు

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని సిఐటియు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల సదస్సు ఎస్‌కె మస్తాన్‌వలి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లాలో కార్మికులకు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్‌ను తక్షణమే పరిష్కరించాలని కోరారు. రాజధాని నిర్మాణంలో స్థానిక కార్మికులకు అవకాశం కల్పించాలని, దానివల్ల రాజధాని నాది అనే భావన కార్మికుల్లో పెరుగుతుందని చెప్పారు. ఇసుక తక్షణమే అందరికీ అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక అందుబాటులో లేకపోవడం వల్ల కార్మికులు ఉపాధి కోల్పోయి, కుటుంబాల ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలకు కృషి చేయాలన్నారు. సంఘం మండల కార్యదర్శి చౌడయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులను ఇవ్వాలని కోరారు. సదస్సులో నాయకులు నాగేశ్వరరావు, రఫాని, ఖాజా బాషా, నాగేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

7న గుంటూరులో రామోజీరావు సంస్మరణ సభ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

పద్మ విభూషణ్ సిహెచ్.రామోజీరావు సంస్మరణ సభ ఈనెల 7న ఉదయం 10 గంటలకు గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తామని జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు, రామోజీరావు సంస్మరణ సభ ఆహ్వాన సంఘం చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో రామోజీ సంస్మరణ ఆహ్వాన సంఘ సమావేశం జరిగింది. 7న నిర్వహించే సభలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మీడియా విభాగం చైర్మన్ ఎన్.తులసిరెడ్డి, సిపిఐ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, వి.శ్రీనివాసరావు, రిటైర్డు ఐఎఎస్‌లు పివి రమేష్, పి.కృష్ణయ్య, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, బిజెపి రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి పాతూరి నాగభూషణం ప్రసంగిస్తారని లక్ష్మణరెడ్డి వివరించారు. సమావేశంలో పి.రామచంద్రరాజు, సామినేని కోటేశ్వరరావు, కన్నా మాస్టర్, మేకల రవీంద్రబాబు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ బాధ్యతలకు వాలంటీర్లు దూరం!

కొనసాగింపుపై స్పష్టత కరువు ● అయోమయంలో వాలంటీర్లు ● నేటి నుండి సామాజిక పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు సేవలందించే నిమిత్తం నియోజకవర్గ స్థాయిలో గ్రామ వార్డు సచివాలయ పరిధిలో సుమారు 1200 నుండి 1500 వందల మంది వాలంటీర్లను నియమించారు. చిలకలూరిపేట పట్టణంలో మొత్తం 552 మంది, మండల స్థాయిలో మరో 450 మంది వాలంటీర్లు వున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో కొంత మంది రాజీనామా చేశారు. వాలంటీర్లు విధుల్లో ఉంటే ఓటర్లపై ప్రభావం చూపుతారనే ఉద్దేశంతో వారిపై ఎన్నికల సంఘానికి కూటమి నేతలు ఫిర్యాదు చేయడంతో, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రభుత్వం వారితో పింఛన్ల పంపిణీని ఆపేసింది. ఎన్నికల తర్వాత వచ్చేది వైసిపి ప్రభుత్వమేనని, రాజీనామా చేసినా మళ్లీ విధుల్లోకి తీసుకుంటామని నమ్మబలకడంతో పై వారిలో కొంత మంది విధుల నుంచి తప్పుకున్నారు. అయితే, ఎన్నికల ప్రచార సమయంలో టిడిపి కూటమి అధికారంలోకి వస్తే వాలంటీర్లను కొనసాగిస్తామని, వారికి నెలకు పదివేల రూపాయలు చెల్లిస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఎన్నికల ఫలితాల తర్వాత టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో చంద్రబాబు ఇచ్చిన హామీ అమలు కోసం వాలంటీర్లు ఎదురు చూస్తున్నారు. అయితే, కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా సామాజిక పింఛన్లు నేటి నుంచి పంపిణీ చేయనున్నారు. పింఛన్ల పంపిణీకి వాలంటీర్ల సేవలు అవసరమైనప్పటికీ, సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేసేందుకే ప్రభు త్వం నిర్ణయించింది.

దీంతో, తమను కొనసాగి స్తారా లేదా అనే అనుమానం వాలం టీర్లలో నెలకొంది. వైసిపి కార్యకర్తలనే వాలంటీర్లుగా నియమించారని భావిస్తున్న టిడిపి, వారిని కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగిస్తారని అనుకోవడం లేదని అధికారులు అభి ప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న వాలంటీర్లను తొలగించినా, ఆ వ్యవస్థను కొనసాగిస్తుందని అంటున్నారు. అయితే ,రాజీనామా చేసి వైసిపితో అంటకాగిన వాలంటీర్లను మాత్రం తొలగించి, మిగిలిన వారిని విధుల్లోకి తీసుకుంటుందనే వారు లేకపోలేదు. ప్రస్తుతం ఉన్న వాలంటీర్లను అందరినీ పక్కనపెట్టి పూర్తిగా కొత్త వారిని, కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వారిని నియమించే అవకాశం ఉందని ,తెలుస్తోంది. ఇన్నాళ్లు పని చేసినా ఏ పార్టీకి వత్తాసు పలకని వాలంటీర్లను అలాగే ఉంచాలనుకుంటు న్నట్లు సమాచారం. మొత్తం వాలం టీర్లను తొలగిస్తుందా? కొత్త వారిని తీ సు కుంటుందా? అనే విషయం తేలకపోవ డంతో ప్రస్తుతం ఉన్న వాలంటీర్లకు తమ భవిష్యత్ గురించిన భయాందోళనల్లో ఉన్నారు.

'మాట నిలబెట్టుకోనున్న ముఖ్యమంత్రి'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం ఏప్రిల్ నెల నుండే రూ 4 వేలు పింఛన్ లెక్క ప్రకారం రూ సామాజిక పింఛన్‌దారులకు రూ.7 వేలు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఇవ్వనున్నట్లు టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఈ సందర్భంగా నరసరావుపేట పట్టణంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభు త్వం వెయ్యి రూపాయలు పెంచుతామని హామీ ఇచ్చి ఐదేళ్లలో పెంచిందన్నారు. సోమవారం ఉదయం 6 గంటల నుండి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దే పెన్షన్ పంపిణీ చేయడం ఒక ఎత్తయితే ఏకంగా రాష్ట్ర సిఎం చంద్రబాబు నాయుడు పెనుమాక లో లబ్ధి దారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్ అందజేయనున్నట్లు చెప్పారు.

వెల్దుర్తిలో అందించనున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి స్వగ్రామం వెల్దుర్తిలో సోమవారం ఉదయం 6 గంటలకు సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు ఆయనే నేరుగా అందించనున్నారు. అనంతరం మాచర్లలోని పలు వార్డులలో లబ్ధిదారులకు పెంచిన పింఛన్లను అందజేస్తారు. గ్రామాల్లో, పట్టణాలలో ఆయా సచివాలయ ఉద్యోగులతో కలిసి టిడిపి క్లస్టర్ యూనిట్ బూత్ ఇన్చార్జిలు, మండల పార్టీ అధ్యక్షులు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెల్యే సూచించారు.

ప్రజాశక్తి-పెదకూరపాడు

నేడు జరగనున్న పెన్షన్ల పంపిణీకి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరవుతారని మండల టిడిపి అధ్యక్షులు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు గంటలకు అమరావతిలో, 8 గంటలకు పెదకూరపాడులో, 9 గంటలకు అచ్చంపేటలో, 10 గంటలకు క్రోసూరులో, 11 గంటలకు బెల్లంకొండలో పెన్షన్ పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

పింఛన్ల పండుగను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- రెంటచింతల

నేడు నిర్వహించబోయే పింఛన్ల పండుగను పార్టీ నేతలు కార్యకర్తలు దగ్గరుండి జయప్రదం చేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కోరారు ఆదివారం పాల్వాయి జంక్షన్లో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటిదాకా అరాచకాలతో అభివృద్ధి అడుగంటిందని, ఇప్పటినుంచి పాలన పరిగెడుతుందన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-వినుకొండ

నియోజకవర్గం ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది.పట్టణం లోని హనుమాన్ నగర్ వద్ద గల వాటర్ ప్లాంట్ నందు గౌరవ అధ్యక్షుడు రెడ్డి నగేష్ (ఐ న్యూస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా యార్లగడ్డ రామ మోహన్ రావు (బుజ్జి)(99 టీవీ), వైస్ ప్రెసిడెంట్ పఠాన్ యూసఫ్ ఖాన్ (సిటీ న్యూస్) ప్రధాన కార్యదర్శి గా ములక తులసీరామ్(భారత్ టుడే), సహాయ కార్యదర్శి యలమంచిలి రమేష్ బాబు(6టీవీ)కోశాధికారి గా అరవపల్లి సైదారావు(రాజ్ టీవీ), గౌరవ సలహాదారుడిగా కే. సుబ్బారావు (టీవీ5) న్యాయ సలహాదారునిగా చంద్రం(సిటీ న్యూస్) సభ్యులు గా మర్రెడ్డి బాబు, పసుమర్తి శ్రీను, పెద్దిశెట్టి దుర్గా, నడికుడి సాంబశివరావు, ఏవి నారాయణ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

ఆలయాన్ని సందర్శించిన జెసి

ప్రజాశక్తి - దుర్గి

శ్రీ నిదానంపాటి అమ్మవారి దేవాలయాన్ని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ దంపతులు ఆది వారం సందర్శించారు. జేసి దంపతులకు పూర్ణకుంభంతో ఆలయ చైర్మన్ యాగంటి వెంకటేశ్వర్లు,ఆలయ అర్చకుల స్వాగతం పలికారు. జెసి దంపతులను ఆలయ చైర్మన్ దంపతులు నూతన వస్త్రాలు అమ్మవారి పటాలు ప్రసాదం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో రజిని కుమారి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవ కేంద్రాలుగా ఆర్బికేలు

ప్రజాశక్తి- రెంటచింతల

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న డాక్టర్ వైయస్సార్ రైతు భరోసా కేంద్రం పేరును రైతు సేవా కేంద్రాలుగా మారుస్తూ ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి ఆదివారం తెలిపారు ఆయన మాట్లాడుతూ ఆర్ బి కే లో వద్ద నవరత్నాలు ఆర్బికే లోగోలను కూడా తొలగించామన్నారు ఆర్ బి కే లోనే కియోస్కోప్ల సాఫ్ట్వేర్ యాప్ లో చిత్రీకరించిన వాటితో పాటు మాజీ సీఎం జగన్ ఫోటోను తొలగించారు నూతన సీఎం నారా చంద్రబాబు నాయుడు ఫోటోను అప్లోడ్ చేయాలని ఆదేశాలు వచ్చినట్లు సమాచారం మండలంలో 11 గ్రామాలు ఉండగా మొత్తం 13 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి - మాచర్ల

గ్రామ సర్పంచ్ పదవిని బాధ్యతగా తీసుకుంటానని, గ్రామ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని గ్రామ సర్పంచ్‌గా ఆదివారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పసుపులేటి బ్రహ్మానాయుడు అన్నారు. మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామం సర్పంచ్ గా పసుపు లేటి బ్రహ్మానాయుడు ఆదివారం బాధ్యతలు తీసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చే యనన్నారు కొత్త ప్రభుత్వంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సహకారంతో నిధులు తీసుకువచ్చి గ్రామంలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.ఇప్పటివరకు సర్పంచ్ గా ఉన్న ఎంఁడ్ర గాలయ్య దీర్ఘకాలిక సెలవు పై వెళ్లడంతో ఉపసర్పంచ్‌గా ఉన్న బ్రహ్మానాయుడు బాధ్యతలు స్వీకరించారు. పంచాయతీ సెక్రటరీ వెంకట్రామయ్య బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ ఎంపీపీ మద్ది గపు వెంకట్రాం రెడ్డి శ్రీనివాసరావు యాదవ్ అనిల్ తోట కూర పరమేశ్వర రావు బంగా లింగయ్య పాల్గొన్నారు.

అర్హులైన చేనేత వృత్తిదార్లందరికీ పింఛన్లు, పథకాలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

చేనేత వృత్తిలో ఉన్న అర్హులందరికీ పెన్షన్లు, సంక్షేమ పథకాలు వెంటనే మంజూరు చేయాలని అఖిల భారత పద్మ శాలీ సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కాకుమాను రమేష్, ప్రధాన కార్యదర్శి చిల్లపల్లి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండలంలోని లగడపాడులో పెదకూరపాడు నియోజకవర్గ పద్మశాలి సంఘం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేతకు వెంటనే క్లస్టర్ ఆర్డరు రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ వృత్తి చేసే వారందరికీ గుర్తింపు కార్డులు వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం పద్మశాలి సంఘ నియోజకవర్గ అధ్యక్షునిగా చెన్నంశెట్టి బాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమేష్, సత్యం నుండి నియామక పత్రాన్ని బాజీ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను సంఘ నేతలు ఘనంగా సత్కరించారు. అనంతరం బాజీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి తన శక్తి వంచన లేకుండా ప్రయత్నిస్తామన్నారు. సమావేశంలో సంఘ నేతలు జి. ఎలమందయ్య, ఎ.వెంకట్రావు, గారపాడు గ్రామ కమిటీ అధ్యక్షులు ఎన్.మల్లికార్జునరావు, లగడపాడు గ్రామ కమిటీ అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, మహిళా అధ్యక్షురాలు ఎ.సామ్రా జ్యం తదితరులు పాల్గొన్నారు.

హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే

ప్రజలకు అందుబాటు ధరల్లో జయతి హాస్పిటల్ మెరుగైన వైద్య సేవలు

డాక్టర్ కందుల రామ్, డాక్టర్ లక్ష్మీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉన్నత ఆశయంతో పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలో జయతి హాస్పిటల్ ప్రారంభించినట్లు డాక్టర్ కందుల రామ్, డాక్టర్ కందుల లక్ష్మీ మద్దినేని (జనరల్ మెడిసిన్ మణిపాల్) దంపతులు అన్నారు. నరసరావుపేట పట్టణం కోట సెంటర్ లోని స్వాతి షాపింగ్ మాల్ ఎదురు ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ కందుల రామ్, డాక్టర్ లక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయతి హాస్పిటల్ ను నరస రావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబులు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఎంపి, ఎమ్మెల్యే మాట్లాడుతూ జనరల్ వైద్య విభాగంలో అత్యంత అనుభవం కలిగిన వైద్యురాలు డాక్టర్ లక్ష్మీ వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసు కోవాలన్నారు.డాక్టర్ కందుల రామ్ మాట్లాడుతూ పుట్టి పెరిగిన ప్రాంతం ఋణం తీర్చుకొనేందుకు అత్యాధునిక నాణ్యతా ప్రమాణాలతో జయతి హాస్పిటల్ ఏర్పాటు చేశామన్నారు.రానున్న రోజులలో తమ హాస్పిటల్ ఆధ్వ ర్యంలో గ్రామీణ ప్రాంతాలలో ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పట్టణ ప్రముఖ వైద్యులు మర్రి పెద్దయ్య, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, రామలింగారెడ్డి, కడియాల వెంకటేశ్వర రావు, ఓగూరి కోటయ్య, గజ్జల బ్రహ్మారెడ్డి, కారసాని శ్రీని వాస రెడ్డి, పిఎం దత్తు, భాస్కర్ లక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి, చేకూరి కోటేశ్వరరావు, కొండపల్లి వెంకటేశ్వర, పువ్వాడ సూర్యనారాయణ పాల్గొన్నారు.

మరో విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు

ప్రజాకళల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా కమిటీ సమావేశం మండలంలోని కాజలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి మాట్లాడారు. ప్రజా సంస్కృతిని పెంపొందించడానికి నేడు ప్రజా కళల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజా కళలను అభివృద్ధి చేసేందుకు రానున్న ఆరు నెలల్లో ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ ప్రణాళిక రూపొందించిందని చెప్పారు. సెప్టెంబర్‌లో గరికపాటి రాజారావు వర్ధంతిని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు, ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమలలో అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో జానపద కళాకారులను గుర్తించి జానపద ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వివరించారు. గుంటూరు జిల్లాలో ప్రజా కళలను ప్రజల వద్దకు విస్తృతంగా తీసుకువెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ప్రజానాట్య మండలి జిల్లా గైడ్ ఎం.రవి మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతిని ఇక్కడివారిపై బలవంతంగా రుద్దుతున్న నేటి పరిస్థితుల్లో ప్రజా సంస్కృతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రజానాట్యమండలి కళాకారులపై ఉందని చెప్పారు. ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తాడేపల్లి, గుంటూరు, పెదనందిపాడు కేంద్రాల్లో పాటల పోటీలు నిర్వహిస్తామని, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ప్రజానాట్య మండలి నాయకులు పి.ప్రసాద్, ఆర్‌వి రాఘవయ్య, పార్వతి, బ్రహ్మయ్య, రాజ్యలక్ష్మి, సుమ పాల్గొన్నారు.

సమావేశంలో నాయకులు

ఇంటర్న్‌షిప్‌తో కూడిన ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - మంగళగిరి : మంత్రి నారా లోకేశ్ సహకారంతో మంగళగిరి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు హెచ్‌సిఎల్ కంపెనీలో ఇంటర్న్‌షిప్‌తో కూడిన ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు టిడిపి నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరాలలో ఇంటర్మీడియట్ ఒకేషనల్, సీఈసీ, హెచ్‌ఎసీ, బైపీసీలో 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, మెరుగైన కమ్యూనికేషన్ స్కిల్ కలిగిన వారికి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఏడాది పాటు శిక్షణ కాలంలో మూణ్ణెల్లు మధురైలో, 9 నెలలు చెన్నయ్‌లో శిక్షణ తీసుకోవాల్సి ఉంటుందని, మొదటి మూడు నెలల తర్వాత ప్రతినెలా రూ.10 వేల గౌరవ వేతనం, శిక్షణ పూర్తయిన తర్వాత ఏడాదికి కనీసంగా రూ.1.70 లక్షల ప్యాకేజీతో కూడిన వేతనం అందుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 8367608888, 9553910733 ఫోన్ నంబర్లకుగాని, మంగళగిరిలోని డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో కానీ సంప్రదించాలని సూచించారు.

ముగిసిన దేవస్థాన భూముల వేలం

ప్రజాశక్తి - తెనాలి : మండల కేంద్రమైన పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వర స్వామివారి దేవస్థాన పరిధిలోని భూములకు మూడేళ్ల కాల పరిమితికి సంబంధించి వేలం శనివారం ముగిశాయని ఆలయ ఉప కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలము వీరనాయకునిపాలెం గ్రామ శివారు సర్వే.నం.561, 566/1ఎ, 566/3బిలోని 1.70 ఎకరాలు, 4 ఎకరాలు, 2.70 ఎకరాలు, 5 ఎకరాలు, 2.58 ఎకరాలు, 2 ఎకరాల మాగాణి భూమికి, దేవరాయబొట్లవారిపాలెం గ్రామ సర్వే నం.23ఇ అరెకరం మాగాణి భూమి మొత్తం 18.45 ఎకరాల భూమికి రెండోసారి వేలం నిర్వహించినట్లు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయశాఖ గుంటూరు ఉప కమిషనరు, ప్రత్యేక అధికారి ఎన్‌ఎల్టి సౌమ్య, పాత గుంటూరు దేవస్థానం కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణలో వేలం నిర్వహించామని, గతేడాది కంటే రూ.86 వేలు అధిక ఆదాయం సమకూరిందని తెలిపారు. ఎకరాకు రూ.29,383 కౌలు వచ్చిందన్నారు.

పొలం పిలుస్తోంది.. రోడ్డు జారుతోంది..

ప్రజాశక్తి-దుగ్గిరాల

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తాము వ్యవసాయంలో బిజీ అయిపోవచ్చని రైతులు హర్షం వ్యక్తం చేస్తుండగా మరోవైపు చిత్తడవుతున్న రోడ్లలో రాకపోకలకు జనం అల్లాడుతున్నారు. మండలంలో శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు కుండపోత వర్షం కురిసింది. మండల కేంద్రమైన దుగ్గిరాలలో 35.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇటీవల చెదురుమదురు వర్షాలు కురుస్తున్నా సాగుకు సరిపోలేదని రైతులు తెలిపారు. తాజా వానతో భూమి పూర్తిస్థాయిలో తడిసిందని, ఇది సాగుకు అనుకూలమని రైతులంటున్నారు. ఇదిలా ఉండగా వర్షానికి రహదార్లు జలమయమయ్యాయి. పాదాచారులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపై ఉన్న గుంతలు వర్షపు నీటితో నిండిపోయాయి ఎక్కడ ఏముందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. స్థానిక జగనన్న కాలనీలో రోడ్లు చిత్తడిగా మారి అక్కడివారు అవస్థ పడుతున్నారు. కాలనీ ఏర్పాటు చేసినా కీలకమైన రహదార్లను విస్మరించారని స్థానికులు వాపోతున్నారు.

జగనన్న కాలనీలో చిత్తడిగా మారిన రహదారి

మానవత్వాన్ని చాటుతున్న మానవత సంస్థ

సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని బాలాజీ కళ్యాణ మండపంలో మానవత వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. సభకు మానవత అధ్యక్షులు పి.విమల కుమారి అధ్యక్షత వహించారు. సంస్థ వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 110 శాఖలతో 70 వేల మంది మానవత్వం గల సభ్యులతో రెండు దశాబ్దాలుగా మానవత్వాన్ని కోట్లాది మంది ప్రజలకు మానవత స్వచ్ఛంద సేవ సంస్థ పంచుతోందని చెప్పారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ అసమానతల ల్యాబ్ ఇటీవల అందించిన గణాంకాల ప్రకారం భారత జనాభాలో పైనున్న 10 శాతం చేతుల్లో 50 శాతం సంపద ఉందని అట్టడుగున ఉన్న 50 శాతం ప్రజల చేతుల్లో 10 శాతం సంపద మాత్రమే ఉందని అన్నారు. సంస్థలు వేలాదిగా ఏర్పడి పేదలకు అండగా నిలవాలన్నారు. రాష్ట్రంలోని సేవా సంస్థల సమ్మేళనాన్ని గుంటూరులో నిర్వహించలని సూచించారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ గుంటూరులో రెండేళ్లుగా వృద్ధాశ్రమాలు, అనాధ ఆశ్రమాలకు అన్నదానాలు, వైద్య శిబిరాలు, అవయవదాన ప్రోత్సాహం, రక్తదాన శిబిరాలు, పేద విద్యార్థులకు ప్రోత్సహకాలు తదితర కార్యక్రమాలు నిర్వహించిందని చెప్పారు. రూ.లక్ష నిధితో విద్యానిధిని ప్రారంభించారు. దాతల సహకారంతో విద్యా నిధిని అభివృద్ధి చేసి, ప్రతిభ గల పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఎన్నిక నిర్వహించగా సంస్థ అధ్యక్షులుగా కొమ్మాలపాటి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కె.సతీష్ బాబు, కోశాధికారిగా టి.వి.సాయిరాం ఎన్నికయ్యారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.జి.శంకర్, ఎ.రామానుజులరెడ్డి, వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రజకవృత్తిదారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి-గుంటూరు

రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, రజక సంక్షేమ-అభివృద్ధి కార్పొరేషన్‌కు విధివిధానాలు రూపొందించి నిధులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య కోరారు. ఈ మేరకు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవికి సంఘ నాయకులు ఆదివారం వినతిపత్రం అందేశారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ రజకులకు లాండ్రీ వృత్తి నిర్వహణకు నెలకు 200 యూనిట్లు కరెంటు ఉచితంగా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రజక వృత్తిదారులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, రజక మహిళలపై అత్యాచారాలు, హత్యలు నివారణకు రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని అనేక సంవత్సరాల నుండి ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేసిందని గుర్తు చేశారు. ఫలితంగా టిడిపి కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో బీసీ తరగతులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేస్తానని, 50 ఏళ్ల వయసు నిండిన ప్రతి వృత్తిదారునికీ వృద్ధాప్య పింఛను మంజూరు చేస్తామని, వృత్తి నిర్వహణకు అవసరమైన ఆదరణ పరికరాలు అందిస్తామని, రజక సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్‌కు విధివిధానాలు రూపొందించి, నిధులు కేటాయించి రజకుల అభివృద్ధికి కృషి చేస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న హామీలు తూచా తప్పకుండా అమలు జరిపే దానికి కృషి చేస్తానని, రజక వృత్తిదారుల సమస్యలను పరిష్కరించడానికి అసెంబ్లీలో తన గళం వినిపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు, హైకోర్టు అడ్వకేట్ తుమ్మపూడి శ్రీధర్, ఆంజనేయులు, నాయకులు బొజ్జ సుబ్బారావు, మండూరు వెంకట నరసయ్య, వెంపాటి చిన్న కొండయ్య (సీతయ్య), పాగోలు శ్రీనివాసరావు, గుంటూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు బెండమూరి లంక కైలాసం, పేరుపాలెం రాంబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాధవికి బొకే అందచేస్తున్న నాయకులు

4న విద్యాసంస్థల బంద్ : ఎస్ఎఫ్ఐ

ఫెడరేషన్ తెనాలి నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - తెనాలి

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెనాలి నూతన కమిటీని ఎన్నుకున్నారు. స్థానిక చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ 4న దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చిందని, తెనాలి పట్టణంలోనూ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని, ఏ రాష్ట్రంలో ఆ రాష్ట్రాలు పరీక్ష నిర్వహించుకోవడానికి వీలు కల్పించాలనే డిమాండ్‌తో బంద్ చేపట్టినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల మూసివేతను ఆపాలని, ఐఐటి ప్రవేశాల్లో రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలని, యూనివర్సిటీల్లో ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలని, విద్యార్థులు, విద్యార్థి నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలని కోరుతూ బంద్ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 11 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా వసంత్, సుభాష్, ఉపాధ్యక్షులుగా భాను వెంకట సాయి, శశికాంత్, ఉదయ్ ఈశ్వర్ సహాయ కార్యదర్శులుగా ధ్రులషన్, ఫహీమ్ ఎన్నికయ్యారు.

9374 మందికి రూ.6.33 కోట్లకుపైగా పింఛను

ప్రజాశక్తి - దుగ్గిరాల

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన సామాజిక పింఛన్ల మొత్తాన్ని మండలంలోని లబ్ధిదార్లకు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం 6 గంటలకు పంపిణీని ప్రారంభించనున్న నేపథ్యంలో ఆదివారం ఆదివారం సెలవు కారణంగా శనివారమే నగదును బ్యాంకుల నుండి ఉద్యోగులు డ్రా చేసి తెచ్చారు. మండల వ్యాప్తంగా 9374 మందికి రూ.6 కోట్ల 33 లక్షల 82 వేలను పంపిణీ చేయనుండగా అత్యధికంగా మండల కేంద్రమైన దుగ్గిరాలలో 1508 మందికి రూ.కోటి 3 లక్షల 37 వేల 500, అత్యల్పంగా చింతలపూడిలో 265 మందికి రూ.17 లక్షల 21 వేల 500 పంపిణీ చేయనున్నారు. దీనికోసం వివిధ శాఖల అధికారులతో సిబ్బందిని ఇప్పటికే కేటాయించారు. తాము సోమవారం ఉదయం 5.30 గంటలకు విధులకు హాజరవుతామని అధికారులు తెలిపారు. లబ్ధిదార్లంతా సోమవారం అందుబాటులో ఉండాలని గ్రామాల్లో ఇప్పటికే దండోరా వేయించారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక తొలిసారిగా పింఛన్లను పంపిణీ చేస్తున్న దృష్ట్యా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని ఆ పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి జి.వెంకటరావు తెలిపారు. దుగ్గిరాలలోని యాదవపాలెం కృష్ణుడి గుడి వద్ద ఉదయం ఆరు గంటలకు పూజలు చేసి పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తామన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు : పట్టణంలో సోమవారం ఉదయం 6 గంటలకు 8వ వార్డు క్యాబిన్‌పేటలోని సచివాలయం వద్ద, 6.30 గంటలకు షరాఫ్ బజార్‌లోని చాందినిచౌక్ వద్ద పింఛన్ల పంపిణీ ఉంటుందని టిడిపి నాయకులు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డి.నరేంద్ర పాల్గొంటారని చెప్పారు.

జామెట్రీబాక్సులు పంపిణీ

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన సర్వదేవ పరంజ్యోతి సేవా సమతి ఆధ్వర్యంలో మండలంలోని బుర్రిపాలెంలోని ఘట్టమనేని నాగర్తత్నమ్మ రాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 130 మంది విద్యార్థులకు ఉచితంగా జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఒ.రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు సంస్థ తరఫున సహకరించటం అభినందనీయమన్నారు.

నేడు జిఎంసి ప్రధాన కార్యాలయంలో గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు : ప్రజల నుండి తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్యం, వంటి స్థానిక సమస్యలపై అందే ఫిర్యాదులు, అర్జీల స్వీకరణకు జిఎంసిలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రీడర్స్ సిస్టం పిజిఆర్ఎస్) జరుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిజిఆర్ఎస్ సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుండి జరుగుతుందని, కార్యక్రమంలో తమతో పాటు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాధిపతులు, డిప్యూటీ కమిషనర్లు, అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా, వీధిదీపాలు, పారిశుధ్యం వంటి స్థానిక సమస్యలపై అర్జీలు, ఫిర్యాదులను అందించవచ్చని, వాటిని నిర్దేశిత సమయంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సిఎంను కలిసిన మాజీ మంత్రి ఆలపాటి

ప్రజాశక్తి-తెనాలి : సిఎం చంద్రబాబును మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కలిశారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆదివారం కలిసి తెనాలి నియోజకవర్గంలో కూటమి ఘన విజయంపై వివరించారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో పొత్తుల నేపథ్యంలో తెనాలి టికెట్‌ను నాదెండ్ల మనోహర్‌కు కేటాయించిన సంగతి తెలిసిందే. అదే సమయంలో పార్టీ అధికారంలోకి రాగానే ఆలపాటికి సముచిత న్యాయం చేస్తామని చంద్రబాబు హామీనిచ్చారు. ఈనెల 26న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో వీరి కలయిక చర్చనీయాంశమైంది. ఎమ్మెల్సీ రేసులో ఆలపాటి రాజేంద్రప్రపాద్ కూడా ఉన్నట్లు సమాచారం.

జిజిహెచ్‌లో సదుపాయాలు మరిన్ని పెంపు

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో మౌలిక వసతుల పెంపుదలకు కృషి చేస్తున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్ కుమార్ తెలిపారు. రోగులకు, ఉద్యోగులు, వైద్యులకు వసతుల కల్పనకూ ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. వార్డులతో పాటు ఓపీ సేవల్లో కూడా సీనియర్ వైద్యులను అందుబాటులో ఉంచుతున్నామని ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు.



గతేడాది కాలంలో కల్పించిన మౌలిక వసతులు?

అత్యవసర చికిత్స కోసం వచ్చే వారికి అందుబాటులో ఐసియూ యూనిట్ ఏర్పాటు చేశాం. బ్లడ్ బ్యాంకు, ఆపరేషన్ థియేటర్లను రోగులకు, వారి అటెండెంట్‌లకు చేరువగా తీసుకువచ్చాం. ఓపీ స్లిప్ కోసం ఎక్కువసేపు నిలబడకుండా, తొక్కిసలాటకు అవకాశం లేకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. రోగుల సహాయకులు కష్టాలు పడుతున్న సందర్భాలు చూసి వారికి వసతి కల్పించాం. పేషెంట్లు ఎక్కువ మంది వస్తుండటంతో 4వ మందుల కౌంటర్‌ను ప్రారంభించాం. ట్రాన్సజెండర్స్ కోసం ప్రత్యేక ఓపీని ప్రారంభించాం. జనరల్ మెడిసిన్ విభాగంలో స్ట్రెచర్‌పై రోగులు ఉండటాన్ని గమనించి 50 పడకలను అందుబాటులో తెచ్చాం.

నిత్యం ఆస్పత్రికి ఓపీ కోసం ఎంత మంది వస్తారు?

ఓపీ కేంద్రాల వద్ద రోజుకు సగటున రెండు వేల నుంచి మూడు వేలకు వస్తున్నారు. దాంతో ఓపీ వద్ద తాకిడి పెరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని మరో10 ఓపీ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చాం. ఓపీలో పని వేళలను మార్పులు చేశాం. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ నమోదు కేంద్రాలను పని చేస్తాయి.

ఓపీ కేసులు ఏ వార్డులో ఎక్కువ వస్తున్నాయి?

గుండె జబ్బు, న్యూరాలజీ ఓపీకి వస్తున్న రోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. అందుకే వారి కోసం ప్రత్యేక ఓపీని ఏర్పాటు చేశాం. సీనియర్ వైద్యులను సైతం ఓపీలో ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఆయా వార్డుల్లో పరీక్షలన్నీ ఒకేచోట చేసేలా చర్యలు చేపట్టాం.

ఆస్పత్రిలో చేపట్టిన నిర్మాణాలు? సదుపాయాలు?

జిజిహెచ్‌లో రూ.3 కోట్లతో అడ్వాన్సుడ్ ఐసియు యూనిట్ నెలకొల్పాం. రూ.5 కోట్లలో వివిధ నిర్మాణాలు చేపట్టాం. ప్రసూతి, స్త్రీ వ్యాధుల చికిత్స విభాగాన్ని రూ.70 లక్షలతో ఆధునికరించాం. పాత ఓపీ విభాగం వద్ద రూ.20 లక్షలతో రేకుల షెడ్డు నిర్మించాం. కార్డియో థోరాసిక్ ఆపరేషన్ థియేటర్‌ను రూ.60 లక్షలతో ఆధునికరించాం. మానసిక వైద్య విభాగానికి రూ.10 లక్షలతో ఎలక్ట్రో కాన్వాల్సిన్ థెరపి పరికరం అందుబాటులోకి తెచ్చాం. నాట్కో సహాయంతో నెఫ్రాలజీ వార్డుకు 10 పడకల డయాలాసిస్ యూనిట్‌ను ప్రారంభించాం. చర్మ విభాగానికి రూ.కోటితో ఆధునిక పరికరం అందుబాటులోకి తెచ్చాం. కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీల కోసం రూ.20 లక్షలతో పరికరాన్ని కొనుగోలు చేశాం. రూ.80 కోట్లతో మాత శిశువు సంరక్షణ కేంద్రం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

గ్యాస్ట్రో వార్డు అభివృద్ధి పనులు?

గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి 30 పడకాలు ఏర్పాటు చేశారు. మూడ్రోజులపాటు గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ ఉండేవిధంగా చర్యలు తీసుకున్నాం. ప్రత్యేకంగా సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వార్డు కేటాయించి 10 పడకలను ఏర్పాటు చేశారు. అసంపూర్తిగా నిలిచిన సర్వీస్ బ్లాక్‌ను పున:ప్రారంభించేందుకు ప్రణాళికలను సిద్ధం చేశాం. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆధునిక సిటి స్కాన్‌ను ఏర్పాటు చేసి త్వరలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

గుండె ఆపరేషన్లు కొనసాగుతున్నాయా?

పద్మశ్రీ గోపాలకృష్ణ గోఖలే ఆధ్వర్యంలో గుండె ఆపరేషన్లు, కిడ్నీ ఆపరేషన్‌లు కొనసాగుతున్నాయి. ఆయన రాకపోయినా సీనియర్ వైద్యులు వీటిని కొనసాగిస్తున్నారు. గుండె జబ్బులు, న్యూరాలజీ ఓపీలను ప్రతిరోజూ రోగులకు అందుబాటులో ఉంచుతున్నాం. న్యూరో సర్జరీ వార్డును ఆధునికరించి 20 పడకలను అందుబాటులో ఉంచాం.

ఆపరేషన్ థియేటర్ల సంఖ్యనుపెంచారా?

ఆపరేషన్ థియేటర్లను ఆధునికరించాం. ఆపరేషన్ థియేటర్ లేక ఇబ్బందులు పడుతున్న గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి మూడో ఆపరేషన్ థియేటర్‌ను కేటాయించారు. క్యాజువాలిటీలో అత్యవసర రోగులకు గతంలో ఉన్న మైనర్ థియేటర్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చాం. వీటితో మరో రెండు థియేటర్లను ప్రారంభించాం. ఆధునిక పరికరాలు అందుబాటులో తీసుకొచ్చాం. అత్యవసర విభాగంలో 24 గంటల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. షిఫ్టుల వారీగా ఆర్ఎంఒల నియామాకం, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌లను 24 గంటలు ఉండేలా ఏర్పాటు చేశాం.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి